నీవెనుకే నా నీడ

కాలెప్పు శివశేఖర్

రాత్రి చాలా భాగం గడిచిపోయింది.

వెన్నెల విరగ గాస్తోంది.

రాత్రి తరిగిపోతోంది.

వెన్నెల కరిగిపోతోంది.

సుమిత్రకు నిద్ర రావడంలేదు.

బెడ్ మీద మహేశ్వర్రావు హాయిగా నిద్రపోతున్నాడు.

ఆమె అతనివేపు చూసి నిట్టూర్చింది.

ఎందుకో ఏడ్వాలనిపించింది.

ఏడ్చినా కన్నీళ్ళు రావు.

ఏనాడో కన్నీళ్లు ఖర్చుచేసేసిందామె.

హృదయంలో అశాంతి.

మెలిపెడుతున్న బాధ.

తెలియని వ్యథ-చిత్రవధ.

బెడ్ మీంచి లేచి కిటికీ దగ్గరకు వచ్చింది.

చంద్రుడు వెలిగిపోతున్నాడు.

చల్లగా గాలి వీస్తోంది.

ఆహ్లాదంగా వున్న వాతావరణం.

ఆనందాన్ని పంచుకునే తరుణం.

వయసు వున్నా అనుభవించే రుణం తనకి లేదు.

ఈ వెన్నెల వృధా....బ్రతుకు వృధా!

ఎన్నో వెన్నెల రాత్రులు .. మరెన్నో వసంతాలు గడిచిపోయాయి.

తనకి సుఖంలేదు....సంతోషం లేదు.

పేరుకి భర్త....తాళికట్టిన మగాడు. అందరి దృష్టిలో మొగుడు.... ఆస్తి-అంతస్తులున్నాయి. అనుభవించే జీవితం వుంది.

కానీ - తనకంటూ ఏమీ లేకుండా పోయాయి.

అతను సంపాదనకోసం తెగ కష్ట పడతాడు. తనకోసం ఒక్క రాత్రికూడా కష్టపడడు.

ఇంట్లో పెళ్ళాం గురించి పట్టించు కోడు.

ఒకోసారి నెలల తరబడి యింటికే రాడు. ఊళ్ళో వున్నప్పుడు ఏ అర్ధ రాత్రో యింటికి చేరుకుంటాడు.

అలసిపోయి హాయిగా నిద్రపోతాడు.

అంతేగానీ తనకంటూ పెళ్ళాం వుందని-

దానికీ కోరికలున్నాయని - వాటిని తీర్చే బాధ్యత భర్తగా తనకుందని ఏనాడు అతను అనుకోడు.

పెళ్ళయి నాలుగేళ్ళవుతున్నా భర్త నుంచి తను ఆశించిందంటూ ఏమీలేదు - యిక ముందు ముందు వుంటుందనే ఆశ లేదు.

అతని మీద అసహ్యం పెరిగి పోయింది.

పెళ్ళికి ముందు తన జీవితం గురించి ఎన్నో కలలు కంది.

పెళ్ళిచూపులప్పుడు అతన్ని చూసి తన కలలు నిజమవుతా యనుకుంది.

పెళ్ళి అయ్యాక కలలు కలలుగానే వుండిపోయాయి.

చివరికి కన్నీళ్ళు మిగిలిపోయి — యింకిపోయాయి.

దాంపత్య జీవితం ఇంత ఘోరంగా వుంటుందా ?

అందరూ ఇలాగే కాపురం చేస్తు న్నారా-?

తను ఆడది.

భర్తను సమస్తం కోరుకోగలదు.

కానీ-సిగ్గువిడిచి యింకేదో కావాలని ఎలా అడగగలదు ?

అక్కడికే తను ఆడదాన్నని.... తనకూ సిగ్గువుందని మరచిపోయి అతని ముందు చాలాసార్లు బయటపడిపోయింది.

అతనిలో చలనం వుండేది కాదు.

విసిగి వేసారిపోయింది.

అతని గురించి పట్టించుకోవడం మానేసింది.

అతను ఎప్పుడు యింటికి వస్తాడో, ఎప్పుడు పోతాడో ఆమెకే తెలీదు.

తన జీవితం ఇంతేనా ?

తన బ్రతుకు యిదేనా ?

ఎన్నోసార్లు కుమిలిపోయింది.

అశాంతితో అలమటించిపోయింది.

అటువంటి సమయంలో —

ఎదురుగా వున్న పెంకుటింట్లో అత నెవరో అద్దెకు దిగాడు.

అతని పేరు వేణుగోపాల్ అని తెలుసుకుంది.

చదువుకున్న కుర్రాడు_ఏదో ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడట.

ఆమె బాల్కానీలోంచి మొదటి సారిగా అతన్ని చూసినప్పుడు, ఆమె చూపులు అతనిమీద నిలిచిపోయాయి.

అతని రూపం ఆకర్షించింది.

పరాయి మగాడివేపు అలా చూడడం ....చూసి ఏవేవో వూహించుకోవడం ఆమెకు తప్పుగా తోచలేదు.

పనిమనిషి ద్వారా కొన్ని విషయాలు తెలిశాయి.

అతని కింకా పెళ్ళికాలేదట_ మంచి ఉద్యోగం వచ్చేంతవరకూ పెళ్ళిచేసుకోడట.

అతను వంటరివాడని తెలిసిన తరువాత, సుమిత్ర మనసులో ఏవో ఆలోచన్లు ఎదిగిపోయాయి.

రోజూ అతను ఆఫీసుకి వెళ తున్నప్పుడు, తిరిగి వస్తున్నప్పుడు బాల్కానీమీంచి చూస్తుండేది.

అతని చేతిలో ఎప్పుడూ ఏవో పత్రికలుండేవి.

అతను పత్రికలు విపరీతంగా చదువు తాడని తెలిసింది.

పనిమనిషి ద్వారా అతన్నుంచి పత్రికలు తెప్పించుకొని చదివేది.

అలా అట్నుంచి యిటూ, యిట్నుంచి అటూ పత్రికలు ట్రాన్స్‌ఫర్ అవు తుండేవి.

అతన్ని చూసి ఆమె బాల్కానీలోంచి నవ్వేది.

ఆమెనవ్వును రిసీవ్‌చేసుకొని అతనూ నవ్వేవాడు.

ఆమె పులకించిపోయేది.

ఆ పులకింత ఏదో అనిపించేది.

ఆ ఏదో ఏమిటో ఆమెకు తెలిసేది కాదు.

యిలా చూపులూ....నవ్వులూ అయి పోయాక ... అవి పాతబడిపోయాక, వారి మధ్య ధైర్యం, ధైర్యంగా నిలబడింది.

ధైర్యం వచ్చాక పత్రికల్లో ఏవో పిచ్చిరాతలు రాసుకొనేవారు.

పిచ్చిరాతలు చదివాక ఆమె తలరాత ఏవిధంగా వుందో అతనికి అర్థమయి పోయింది.

మనసులో సానుభూతి నిండి పోయింది.

తన సానుభూతిని పత్రికలో జాగ్రత్తగా మడతబెట్టి పంపాడు

ఫలితంగా _?

ఓ అర్ధరాత్రి అతను గోడదూకి ఆమె గదిలోకి ప్రవేశించాడు.

ఆ గదిలో అతనికోసం వేచివున్న ఆమె....ఆమెతో పాటు బెడ్....బెడ్ మీద విరిసిన మల్లెలు నిరీక్షిస్తూ కనిపిం చాయి.

ఆ రాత్రి ఆమె....ఆమెతో పాటు బెడ్ .... బెడ్‌మీద మల్లెలు నలిగి పోయాయి.

ఆమె మొదటిసారిగా అతనిలో మగవాడ్ని చూసింది.

ఈ మగాడి ముందు తన మొగుడు పొయ్యిలో కాలని కట్టెలా అయిపోయాడు.

అంతే! ఆమె జీవితానికో అర్థం బోధపడింది.

మొగుడులేని రాత్రి ఆమెకో స్వర్గం.

మొగుడు వున్న రాత్రి ఆమెకో నరకం.

ఇది ఆమె తప్పుకాదు.

ఇటువంటి తప్పులుచేసే భర్తచాటు ఆడవాళ్ళు చాలమంది ఉన్నారు.

అందరి తప్పులు యీ రకమైనవిగా వుండకపోవచ్చు.

కానీ — అన్ని తప్పులకు హేతువు పరిస్థితులు.

ఈ పరిస్థితులే ఆడవాళ్ళని దిగజార్చేస్తున్నాయి. వీధిన పడేస్తున్నాయి—కాపురాల్ని కూల్చేస్తున్నాయి.

దీనికి బాధ్యులెవరు? ఎవరు?

ఎవరో వారెవరో ఎవరికివారే ఆలోచించుకోవాలి.

ప్రేమయినా....పిచ్చయినా .... మరేదయినా సరే, తలకెక్కినవారు వాటికి దూరంగా పారిపోలేరు. ఉన్మాదితో ఎక్కడికో పరుగెడుతుంటారు.

ఆమె అతనికోసం పరిగెత్తింది.

ఎంతదూరమని....యింకెంత కాలమని అలసిపోయింది.

అతనితో జీవితాంతం ఉండిపోవాలనిపించింది.

అతను కావాలనుకుంటే మొగుడ్ని వదులుకోవాలి—వదిలించుకోవాలి – ఎలా?

విడాకులు తీసుకోవాలి.

వాటిని అడిగే ధైర్యం ఆమెకు లేదు.

మరేం చేయాలి? పారిపోవాలి.

ఎవరికీ అందనంత దూరం....కనిపించని చోటుకి వెళ్ళిపోవాలి.

అలా అనుకున్న తరువాత ఆమె కో తెగింపు వచ్చేసింది.

తెగింపు తన తెరచాటు బ్రతుక్కి—ముగింపు అనుకుంది.

ఓ వెన్నెల రాత్రి వేణుగోపాల్ కౌగిలిలో హాయిగా వదిగిపోయినప్పుడు తన అభిప్రాయం అతనికి చెప్పింది.

అతను మౌనంగా ఆలోచిస్తూండిపోయాడు.

ఆమెను వదులుకోవడం ఇష్టంలేదు.

ఆమె చెప్పినట్లు లేచిపోవాలి.

ఎక్కడికని వెళ్ళాలి....వెళ్ళి ఏం చెయ్యాలి?

సమస్య పరిష్కారం కావడంలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్" అందామె.

"ఆఁ .... ఏమిలేదు....మరోసారి ఆలోచించు సుమిత్ర."

"బాగా ఆలోచించే యీ నిర్ణయం తీసుకున్నాను."

"ఇక్కడ ఉద్యోగం వదిలేసి, మరో చోట కెళ్ళి ఎలా బ్రతకాలి?

"దాందేవుంది నా దగ్గర యిరవై కాసుల బంగారం వుంది. కూడా ఎంతో కొంత డబ్బు తీసుకొస్తాను. నీకు వుద్యోగం వచ్చేంత వరకూ మన డబ్బే మనల్ని బ్రతికిస్తుంది.

ఆమె చెప్పింది బాగానే వుందని పించింది.

అంగీకరించాడు. "మరెప్పుడు వెళదాం ?"

"ఆయన రేపు క్యాంపునుంచి వస్తున్నారు. మళ్ళీ ఎప్పుడు వెళ్ళిపోతారో తెలీదు .. తెలుసుకొని నీకు చెపుతాను."

ఆ రాత్రికి యిద్దరూ విడిపోయారు.

ఎక్కడో కోడి కూసింది.

అప్పుడే తెల్లారిపోవస్తోంది.

సుమిత్ర కిటికీ దగ్గర్నుంచి నడిచి మెల్లిగా బెడ్ ఎక్కింది.

ఆమె లేచేసరికి వుదయం పది గంట లయింది.

అప్పటికే మహేశ్వర్రావు బయటకు వెళ్ళిపోయాడు.

బాల్కనీలోకి వచ్చి చూసింది.

అప్పుడే వేణుగోపాల్ ఆఫీసు కెళుతూ కనిపించాడు.

ఆమెను చూసి చిన్నగా నవ్వేడు.

అతను వీధి మలుపు తిరిగేంతవరకూ చూస్తుండిపోయింది.

ఆ పగలంతా మహేశ్వర్రావు యింటికి రాలేదు. అతను సాధారణంగా యింటికి రాడు ఏదో హోటల్లో భోజనం చేసేస్తాడు.

రాత్రి పన్నెండు గంటల సమయంలో అతను యింటి కొచ్చాడు.

వస్తూనే బెడ్ ఎక్కేశాడు.

సుమిత్రకు మెలుకువవచ్చి చూసింది.

అతను దుప్పట్నీ మీదకు లాక్కుంటూ కనిపించాడు.

ఆమెకు వళ్ళు మండిపోయింది.

దుప్పట్నీ తప్ప తన్నెప్పుడూ మీదకు లాక్కోడు.

"ఎప్పుడొచ్చారు" అడిగిందామె.

మహేశ్వర్రావు వులిక్కిపడిచూశాడు. "నువ్వింకా మేలుకొనే వున్నావా ?"

"ఇప్పుడే మెలుకువ వచ్చింది."

"ఏదో అడిగావ్".

"మీరు మళ్లీ ఎప్పుడెళుతున్నారు?"

అతను ఆశ్చర్యంగా భార్య మొహం లోకి చూశాడు. ఆమె ఎప్పుడూ అలా అడిగివుండలేదు. "రేపు రాత్రి పది గంటల ట్రైన్‌లో వెళుతున్నాను."

ఆమె మరేం మాట్లడకుండా కళ్ళు మూసుకుంది.

ఉదయం ఆమె త్వరగానే లేచింది.

బెడ్‌మీద భర్త కనిపించలేదు.

బాత్ రూమ్ లో కెళ్ళి మొహం కడుక్కొని వచ్చింది.

మహేశ్వర్రావు హాల్లో పేపరు చదువుతూ కనిపించాడు.

ఆమెను చూసి చిన్నగా నవ్వేడు. "సుమిత్రా యీ వార్త చదువుతాను, విను".

"నాకు వినే వోపికలేదు" అనేసి ఆమె వెళ్ళబోయింది.

"కాదు చాలా యింట్రస్టింగ్ మేటర్" తప్పనిసరియై కూర్చుంటూ "చదవొద్దు గాని, చెప్పండి వింటాను" అంది.

"ఇద్దరు యువతీ యువకులు ప్రేమించుకున్నారట — వాళ్ల పెళ్ళికి పెద్దవాళ్ళు అంగీకరించలేదు. అందుకని వాళ్లు లేచిపోయారు. పెళ్ళి చేసుకొని, యిల్లు దొరక్క, లాడ్జిలో కాపురంపెట్టారట. అతనికి వుద్యోగం లేదు. తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం శూన్యం. వెంట తెచ్చుకున్న డబ్బులు అయిపోయాయి- లాడ్జి బిల్లు పెరిగిపోయింది. ఆకలి వాళ్లను మాడ్చేసింది. బ్రతికేమార్గం కనిపించక వాళ్లిద్దరూ విషం త్రాగి లాడ్జి రూమ్‌లో ఆత్మహత్య చేసుకున్నారట. అదీ విషయం....అందుకనే లేచిపోవడం తేలికే...కాని తెలియని వూళ్లో బ్రతకడం కష్టం సుమిత్రా".

ఆమె మొహం పాలిపోయింది.

అతనన్న చివరిమాటలు గుండెల్లో బాకుల్లా దిగబడిపోయాయి.

ఈ వార్త చెప్పడంలో అతని వుద్దేశ్యం-?

వేణుగోపాల్‌తో, తను లేచిపోటోతున్న విషయం అతనికి తెలిసిపోయిందా? ఎలా తెలిసింది-? ఎలా తెలిసింది-? ఎలా తెలుస్తుంది-?

ఆమె చాలాసేపు అలానే కూర్చుండిపోయింది.

ఎన్నో సందేహాలు - మరెన్నో అనుమానాలు.

మహేశ్వర్రావు పది గంటల ప్రాంతంలో బయటకెళ్లిపోయాడు.

ఆమెకు మనస్తిమితం లేకుండాపోయింది.

ఏమయినసరే యీ రాత్రికే వెళ్లిపోవాలి.

సాయంత్రం వేణుగోపాల్ ఆఫీసు నుంచి రాగానే పత్రికలో లెటర్ పెట్టి పంపించింది.

భర్త పదిగంటల ట్రైన్‌కి వెళ్లిపోతాడు.

పన్నెండు గంటలకో ట్రైన్‌వుంది.

మహేశ్వర్రావు రాత్రి తొమ్మిది గంటలకు యింటికి వచ్చాడు. వస్తూనే సూట్‌కేసులో బట్టలు సర్దుకున్నాడు. బ్రీఫ్‌కేస్‌లో డబ్బు సర్దుకున్నాడు.

సుమిత్ర చూస్తూనేవుంది. మొత్తం పాతికవేలు తక్కువ వుండవు. అంత డబ్బు ఎక్కడికి తీసుకెళుతున్నాడు-?

"ఓకే డార్లింగ్ వస్తా" అనేసి అతను వెళ్లిపోయాడు.

ఆమె తేలిగ్గా వూపిరి పీల్చుకుంది. ఆనందపడిపోయింది.

పదకొండున్నర_

ఆమె సూట్ కేస్‌తో ఆ బిల్డింగ్‌లోంచి బయటపడింది.

రిక్షాలో స్టేషన్ చేరుకుంది.

టికెట్స్ కౌంటర్ దగ్గర నిలబడి పోయింది.

వేణుగోపాల్ కోసం ఎదురుచూసింది.

ఆ పరిసరాల్లో అతను కనిపించలేదు.

అతను యింకా రాలేదా.... ఎందుకు రాలేదు.... గంట ముందుగా స్టేషన్‌కి వెళ్లి టికెట్స్ రిజర్వేషన్ చేయమని లెటర్‌లో రాసిందే తను.... అతను స్టేషన్‌కి వచ్చాడా.... వచ్చి టికెట్స్ తీసుకొని ప్లాట్‌ఫారమ్ మీదకు గానీ వెళ్ళాడా... ?

ఆమె చిరాకుపడిపోయింది.

తను యింట్లోంచి బయటకు వస్తున్నప్పుడు.... అతనింటికేసి చూసింది.... గొళ్ళానికి తాళం వ్రేలాడుతూ కనిపించింది.... అంటే అతను స్టేషన్‌కి వచ్చే వుండాలి.... మరి కనిపించడేం.... ?

ఆమె చుట్టూ చూసింది. ఒక్కసారిగా అదిరిపడింది.

మహేశ్వర్రావు ఆమెవేపే వస్తూ కనిపించాడు.

అతను వూరు వెళ్లలేదా ? వణికి పోయింది.

"సుమిత్రా" అతను దగ్గరకు వచ్చి పిలిచాడు.

ఆమె కళ్లలో భయం తొంగి చూస్తోంది.

"యింతకు ముందే వేణుగోపాల్ స్టేషన్‌కి వచ్చాడు.... మీరిద్దరూ ఎక్కడికి వెళుతున్నారో ఏమిటో నాకు తెలుసు.... ఎలా తెలుసు నంటావా.... మీ గురించి పనిమనిషి ద్వారా ఎప్పటి కప్పుడు వివరాలు తెలుసుకుంటూనే వున్నాను ... నీమీద నాకు ఎటువంటి కోపం లేదు.... వేణుగోపాల్‌కి పాతికవేలు యిచ్చాను... నీకీ డబ్బు కావాలో లేక సుమిత్ర కావాలో తేల్చుకోమన్నాను.... అతను కనీసం ఆలోచించకుండా డబ్బే కావాలన్నాడు.... తీసుకోమన్నాను ఆ డబ్బు తీసుకొని అతను ట్రయిన్ ఎక్కి వెళ్ళిపోయాడు .. సుమిత్రా యిక నీవు చెప్పు...నీకు వేణుగోపాల్ కావాలో లేక నేను కావాలో ఆలోచించి చెప్పు... అయిదు నిమిషాలు టయం యిస్తున్నాను."

సుమిత్ర ఆలోచించలేకపోతోంది.

నిమిషాలు గడిచిపోతున్నాయి... ?